ఎమ్మెల్యే కళావతికి అస్వస్థత

పాలకొండ : స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి ఈ నెల 21న సీతంపేట మండలం దోనుబాయి లో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని అస్వస్థతకు గురైన సంగతి తెలిసింది. అయితే నాలుగు రోజులుగా విశ్రాంతి తీసుకుంటున్న ఆమె బుధవారం తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో బుధవారం స్థానిక ఏరియా ఆస్పత్రి చేరి చికిత్స పొందారు. ఏరియా ఆస్పత్రి సూపరింటిండెంట్ జి.నాగభూషణరావు, ఆర్ఎంఒ జె.రవీంద్రకుమార్ దగ్గరుండి వైద్యసేవలందిం చారు. నెలరోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. అదే రోజు సాయంత్రం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు.

ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎంఎల్ఎ

ఇఎ మెడపై హౌసింగ్ కత్తి

- నిర్మాణానికి గుదిబండగా గుమడాం లేఅవుట్
- ఆసక్తి చూపని పేదలు
- లక్ష్యాల నిర్దేశంతో అధికారులు ఆందోళన

ప్రజాశక్తి - సాలూరు

ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిందన్న చందంగా ఉంది మున్సిపాలిటీలో పనిచేస్తున్న సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ల (ఇఎ) పరిస్థితి. ఉద్యోగాల్లో చేరి మూడేళ్లయినా వారి విధులు, బాధ్యతలు తెలుసుకోడానికి చాలా సమయం పట్టింది. దాదాపు ఏడాదిన్నర వరకు వారు ఆడుతూ పాడుతూ ఉద్యోగాలను వెలగబెట్టారు. ఇప్పుడిప్పుడే విధి నిర్వహణపై శ్రద్ధ వహిస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు పట్టణంలోని గుమడాం జగనన్న లేఅవుట్ గుదిబండగా మారింది. అక్కడ సుమారు 1400మంది పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. పట్టాలు పంపిణీ చేసి రెండేళ్లయింది. కానీ ఇంతవరకూ లబ్దిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టలేదు. ఇళ్ల నిర్మాణానికి అనువుగాని స్థలంలో పట్టాలు మంజూరు చేశారనే అభిప్రాయం వారిలో గూడుకట్టుకుని ఉంది. ఇంతవరకు సుమారు 40మంది పేదలు మాత్రమే అక్కడ పునాదులు నిర్మించి వదిలేశారు. ఇళు నిర్మించకపోతే పట్టాలు రద్దు చేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు హెచ్చరించినా వారిలో చలనం లేదు. ఇళ్ల నిర్మాణంపై ఆసక్తి లేనివారు పట్టాలు వాపసు చేయాలని మున్సిపల్ అధికారులు కోరడంతో ఇప్పటికీ చాలామంది లబ్దిదారులు పట్టాలు వాపసు చేశారు. ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలని వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది ఒత్తిడి పెంచుతుండడంతో భరించలేక కొంతమంది లబ్దిదారులు పట్టాలు వాపసు చేయడానికి సిద్ధమయ్యారు. ఇంతకీ ఆ లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణానికి లబ్దిదారులు ముందుకు రాకపోవడానికి కారణాలున్నాయి. పట్టణానికి లేఅవుట్ దూరంగా ఉండడంతో పాటు సేకరించిన భూమి ఇళ్ల నిర్మాణానికి అనువైన ప్రదేశం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అక్కడ పునాది నిర్మాణానికే లక్షరూపాయల వరకు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణానికి రూ.లక్షా 80వేలు మాత్రమే మంజూరు చేస్తోంది. పునాదికే లక్ష రూపాయలు ఖర్చు చేస్తే మిగిలిన డబ్బులతో ఇళ్ల నిర్మాణం ఎలా చేయాలనే ఆలోచనలో పేదలుపడినట్లు తెలుస్తోంది. దీంతో మెజారిటీ లబ్దిదారులు ఈ లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణం పై ఆసక్తి చూపడం లేదు. గతంలో గృహనిర్మాణ శాఖ మంత్రిగా పనిచేసిన

పునాదులకే పరిమితమైన గుమడాం లేఅవుట్-5

రంగనాధరాజు ఈ లేఅవుట్‌ను పరిశీలించారు. లేఅవుట్‌లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, నిర్మాణాలు చేపట్టాలని కోరారు. కానీ లబ్దిదారుల్లో స్పందన లేదు. పదేపదే జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, మున్సిపల్ ప్రత్యేక అధికారులు గృహ నిర్మాణాలపై సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. పట్టణంలో పేదల ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన పురోగతి లేకపోవడంతో ఉన్నతాధికారుల సమీక్ష సమావేశాల్లో సమాధానాలు చెప్పలేకపోతున్నామని జిల్లా అధికారులు సెలవిస్తున్నారు.

ఇటీవల కొద్దిరోజుల క్రితం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పట్టణ, మండల పరిధిలో గృహనిర్మాణంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మండల పరిధిలో గృహ నిర్మాణం తీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కానీ పట్టణంలోని గుమడాం లేఅవుట్ -5లో ఇళ్ల నిర్మాణం చాలా మందకొడిగా ఉండడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పట్టణంలోని 14సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లను నిలబెట్టి ఆయా సచివాలయం పరిధిలో గృహ నిర్మాణం ప్రగతి గురించి అడిగి తెలుసుకున్నారు. ఇదే పురోగతి కొనసాగితే ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై వేటు వేస్తామని హెచ్చరించారు. ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించేలా చూడాల్సిన బాధ్యత ఇంజనీరింగ్ అసిస్టెంట్లదే అన్నట్లు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. లబ్ధిదారులు ఇళ్లు కట్టడానికి ముందుకు రాకపోతే తాము ఏం చేస్తామని వారు చెబుతున్నారు. కొద్దినెలల క్రితం డిప్యూటీ సిఎం రాజన్నదొర కూడా ఈ లేఅవుట్‌ను పరిశీలించారు. లేఅవుట్‌లో రహదారులు, తాగునీరు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పనపై ఆయన హామీ ఇచ్చారు. దాని ప్రకారం లేఅవుట్‌లో ఇంటర్నల్, ఎప్రోచ్ రోడ్ల నిర్మాణ పనులు త్వరితగతిన జరుగుతున్నాయి. కోట్లాది రూపాయలతో మౌలిక సదుపాయాల కల్పన జరుగుతోంది. కానీ ఇళ్ల నిర్మాణంలో ప్రగతి కనిపించడం లేదు. లేఅవుట్ ప్రారంభించి మూడేళ్లు కావస్తున్నా ఇంతవరకు అక్కడ ఒక్క ఇంటి నిర్మాణం కూడా పూర్తి కాలేదు. దీంతో హౌసింగ్, మున్సిపల్ అధికారులు తలలుపట్టుకుంటున్నారు. గృహనిర్మాణంపై ఉన్నతాధికారుల సమీక్ష సమావేశాల్లో సమాధానాలు చెప్పలేక నీళ్లు నిమిలే పరిస్థితి కనిపిస్తోంది.

గుమడాం లేఅవుట్ -5లో కనీసం 50శాతం కూడా లబ్దిదారులు ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టలేదు. ఒక గృహ ప్రవేశం కూడా జరగలేదు. పట్టణంలోని మిగిలిన లేఅవుట్లలో కొద్దోగొప్పో ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో లబ్దిదారులకు బ్యాంక్ లింకేజ్ రుణాలు మంజూరు ఆవశ్యకత ఎందుకనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇళ్ల నిర్మాణం ప్రారంభించిన తర్వాత శ్లాబ్ నిర్మాణం పూర్తయిన తర్వాత లబ్దిదారులకు అవసరమైతే రూ.35వేల బ్యాంక్ లింకేజ్ రుణాలు మంజూరు చేయాల్సి ఉంది. కానీ ఇళ్ల నిర్మాణం చేపట్టని పేదలకు బ్యాంక్ లింకేజ్ రుణాల మంజూరు గురించి ఆలోచించడం అనవసరమే అవుతుంది. కానీ ఇటీవల సమీక్ష సమావేశంలో బ్యాంక్ లింకేజ్ రుణాలు మంజూరు చేయించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ మెప్మా అధికారులపై ఒత్తిడి చేయడం చర్చనీయాంశమైంది. లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణం త్వరితగతిన జరగకపోవడానికి అసలు కారణాలపై దృష్టి సారించకుండా జిల్లా అధికారులు చిరుద్యోగులైన ఇంజనీరింగ్ అసిస్టెంట్ల మెడపై కత్తి పెట్టడం వివాదాస్పదమవుతోంది.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆనంద్

గణతంత్ర దినోత్సవానికి సర్వం సిద్ధం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిల్లాకేంద్రంలో గురువారం జరగనున్న గణతంత్ర దినోత్సవానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్ బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు. స్థానిక జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుగనున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడిన అనంతరం మొట్ట మొదటి సారిగా గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుగనున్నాయి. పోలీస్ దళాలు, సిఆర్‌పిఎఫ్ దళాలు, ఎన్‌సిసి, అటవీ శాఖ సిబ్బంది కవాతు రీ హార్శల్స్ చేశారు. గణతంత్ర వేడుకల్లో భాగంగా గురువారం ఉదయం 9 గంటలకు జిల్లా కలెక్టర్ జాతీయ జెండాను ఎగుర వేస్తారు. పోలీస్ దళాల వందనాన్ని స్వీకరిస్తారు. ఈ నేపథ్యంలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా కలెక్టర్ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించనున్నారు. వివిధ శాఖల శకటాలు, ప్రదర్శన శాలలు ఏర్పాటు చేసి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు వివరించనున్నారు. సిఆర్‌పిఎఫ్ దళాల ఆయుధ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ప్రజలు గణతంత్ర వేడుకల్లో భాగస్వామ్యం కావాలని జాయింట్ కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఎస్‌పి డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్, ఆర్‌డిఒ కె.హేమలత, డిఎస్‌పి ఎ.సుభాష్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవానికి ముందుస్తుగా రిహార్సల్ చేస్తున్న పోలీసులు

ఘనంగా పోలమాంబ అనుపోత్సవం

- వనంగుడికి పరుగు తీసిన అమ్మవారు..
- 31న మారు జాతర
- టిక్కెట్ల ఆదాయం రూ.6.60 లక్షలు

ప్రజాశక్తి - మక్కువ

ఉత్తరాంధ్ర ఆరాధ్య దేవత శంబర పోలమాంబ అమ్మవారి అనుపోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. స్థానిక సావిడి వీధిలోని అమ్మవారి ఘటాలకు పూజలు చేపట్టి బుధవారం ఉదయం ఉయ్యాల, కంబాల కార్యక్రమం చేపట్టారు. అనంతరం భామ కళాపాల నడుమ కోలాటాలు, వివిధ నృత్యాలతో అమ్మవారిని ఆనందంపజేస్తూ అనుపు కార్యక్రమానికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక గోముఖీ నది దాటిన వెంటనే అమ్మవారు ఏకబిగున వనం గుడికి పరుగు తీశారు. అమ్మవారి వెంట భక్తజనమంతా వనం గుడికి చేరుకున్నారు. వనం గుడిలో అమ్మవారి ఘటాలను ప్రతిష్టింపజేసారు. దీంతో మొదటి జాతర పూర్తికా వచ్చింది. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇఒ రాధాకృష్ణ, ట్రస్ట్ బోర్డు చైర్మన్, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ఎఎఐ జి.పైడిరాజు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

ఈనెల 31న మారు జాతర

ఈనెల 31న మంగళవారం అమ్మవారి మారుజాతర

వనం గుడికి వెళ్తున్న అమ్మవారు

నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ ఇఒ రాధాకృష్ణ తెలిపారు వనంగుడిలో మారు జాతర మొదలుకొని మరో 8 వారాలు ఇక్కడే జాతర నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జాతర అనంతరం మహా చండీయాగం, మహా అన్నదాన కార్యక్రమం కూడా వనం గుడి వద్ద నిర్వహిస్తామని తెలిపారు

తొలి జాతర టిక్కెట్లు ఆదాయం రూ.6.60 లక్షలు

అమ్మవారి తొలి జాతర టిక్కెట్లు ద్వారా ఆదాయం రూ.6.60 లక్షలు లభించినట్లు ఇఒ రాధాకృష్ణ బుధవారం తెలిపారు. క్యూలైన్‌లో టిక్కెట్లు, ప్రసాదాలు, కేశఖండన పలువాటికి సంబంధించి ఆలయానికి వచ్చిన ఆదాయం ఆయన వివరించారు. ఇంకా భక్తులు హుండీలో సమర్పించిన ఆదాయాన్ని లెక్కించాల్సి ఉందని తెలిపారు.

కోలాటం చేస్తున్న మహిళలు

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

ప్రభుత్వ ఏర్పాటులో ప్రతి ఓటరు భాగస్వామి కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రజాస్వామంలో ప్రభుత్వ ఏర్పాటులో ఓటరు కీలక భాగస్వామి అని కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా కార్యాలయాల సముదాం (ఆర్‌సిఎం స్కూలు) వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టరు నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కు గుర్తించాలని, ఎటువంటి ప్రలోభాలకు, వత్తిడికి లొంగకుండా నిర్భయంగా ఓటు వేయాలని అన్నారు. 1950లో జనవరి 25న ఎన్నికల కమిషను ఏర్పాటు కాబడిందన్నారు. 2011 నుంచిడి ప్రతి సంవత్సరం ఒక ప్రత్యేక అంశంతో జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. గత సంవత్సరం ప్రచార అంశంగా 18 ఏళు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా చేర్చాలని నినాదంతో పని చేశామన్నారు. జిల్లాలో విభిన్న ప్రతిభావంతులు, సంచార జాతి వారు, ట్రాన్స్ జెండర్లను ఓటర్ల జాబితాలో చేర్చడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలిపారు. మారుమూల ప్రాంత గిరిజనులను నూరు శాతం ఓటర్లుగా చేర్చామని, 63మంది ట్రాన్స్ జెండర్లు ఓటర్లుగా నమోదయ్యారని తెలిపారు.

కార్యక్రమానికి ముందుగా ఓటు హక్కుపై చైతన్యం కలిగిస్తూ నిర్వహించిన ముగ్గుల పోటీలను జిల్లా కలెక్టరు సందర్శించారు. వేదిక వద్ద ఏర్పాటు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్; సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న కలెక్టర్, జెసి, ఆర్‌డిఒ

చేసిన సెల్ఫీ పాయింటులో ఫోటో తీసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ ఓటర్లు డాక్టర్ జి.శ్రీరాములు (తొలి ఓటు 1961), సిహెచ్ బదరీనాథ్ (తొలి ఓటు 1960), గండి చిన్నంనాయుడు (తొలి ఓటు 1952) లకు సన్మానం చేశారు. ముగ్గులపోటీల్లో మొదటి బహుమతి ఎస్‌డివి కళాశాలకు చెందిన టి.సోమేశ్వరి బృందానికి, రెండో బహుమతి గరుగుబిల్లి మండలం టి.ఉషారాణి వెలుగు బృందానికి, మూడో బహుమతి ఎస్‌విడి కళాశాలకు చెందిన పి.సౌమ్య బృందానికి, నాలుగో బహుమతి స్థానికం జిజె హైస్కూలుకు చెందిన ఎల్.జయంతి బృందం గెలుచుకున్నారు. నూతన ఓటర్లు పి.హేమలత, పి.తరుణ్, బి.శివ, జి.రాజా, వి.గౌరి, ఎ.రాజు, ఎం.సాహితి, సిహెచ్. దిలీప్, లక్ష్మీ దుర్గ, హైందవి, ప్రణయ్ కుమార్‌కు ఓటరు గుర్తింపు కార్డులు అందజేసి, వారిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జెసిఒ.ఆనంద్, ఆర్‌డిఒ కె.హేమలత, తహశీల్దారు శివన్నారాయణ, ఎన్నికల సెక్షను సూపరింటెండెంటు డి.రవి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి బి.జగన్నాధం, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎ.ఈశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్ కుమార్, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రెసిడెంట్ అవార్డుకు ఎఎస్ఐ రాజు ఎంపిక

-భోగాపురం : భోగాపురం పోలీసు స్టేషన్ ఎఎస్ఐ తిరుమల రాజు సూర్య నారాయణ రాజుకు కేంద్ర ప్రభుత్వం ప్రెసిడెంట్స్ పోలీసు మెడల్ ప్రకటించింది. రాష్ట్రం నుంచి 15 మందికి ఈ మెడల్ ప్రకటించగా వారిలో జిల్లాకు చెందిన ఎఎస్ఐ రాజు ఒకరు. 1989లో పోలీసుశాఖలో కానిస్టేబుల్‌గా చేరిన సూర్యనారాయణరాజు 2010లో హెచ్‌సి గాను, 2018లో ఎఎస్ఐ గాను ఉద్యోగోన్నతి పొందారు. సీతానగరం, పాచిపెంట, కొత్తవలస, చీపురుపల్లి, భోగాపురం, విజయనగరం, సిసిఎస్, జిఆర్‌పిలో వివిధ హోదాల్లో ఆయన పనిచేశారు.

తైక్వాండో పోటీలకు అమృత

విజయనగరం టౌన్ : ఈ నెల 27 నుంచి బరేలిలో జరిగే 39వ జాతీయస్థాయి జూనియర్స్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలకు విజయనగరానికి చెందిన క్రీడాకారిణి జి.అమృత వర్షిణి ఎంపికైంది. ఈ సందర్భంగా అమృతను జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు గురాన అయ్యలు, కార్యదర్శి సిహెచ్ వేణుగోపాల్ రావు అభినందించారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల అడ్డగింత

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని వసంత గ్రామ ముతంద్రాంగి సరిహద్దులో గ్రీన్‌ఫీల్డ్ రహదారి పోరాట కమిటీ కో కన్వీనర్ గులిపల్లి గంగు నాయుడు అద్వర్యన రైతులు రెండో రోజు పనులను అడ్డుకున్నారు. పంట పొలాల్లోకి నీరు పోయే కల్వర్టులను ఏర్పాటు చేయాలని రైతులు కోరినా గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్వాహకుల పట్టించుకోకపోవడంతో బుధవారం రహదారి పనులను మరోసారి రైతులు అడ్డుకున్నారు. ఇరిగేషన్ అధికారులు కల్వర్టు 428, 980నెంబరు గల రాయవద్ద కట్టాలని రికమెండ్ చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని బైఠాయించారు. రోడ్డువద్దంటూ మహిళలు, రైతులు వంటా వార్పు కార్యక్రమాన్ని చేపట్టి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఫీల్డ్ రహదారి పోరాట కమిటీ, సర్పంచ్ సిరికి సత్యనారాయణ, ఎంపిటిసి చొక్కాకు సత్యారావు, మాజీ సర్పంచ్ పోలినాయుడు, మాజీ సర్పంచ్ జగరపు దేవుడమ్మ, చొక్కాకు పెద సింహాద్రి, మాజీ సర్పంచ్ కొల్లి వెంకటరావు, నరిసింనాయుడు, కసిరెడ్డి రామారావు తదతరులు పాల్గొన్నారు.

ముఖహాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలి

మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీలో పనిచేస్తున్న అన్ని విభాగాల కార్మికులకు ముఖహాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ బుధవారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ కమిటీ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. పట్టణ కమిటీ అధ్యక్షులు టి..రాముడు, కార్యదర్శి టి.శంకరరావు ఆధ్వర్యాన కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన హెల్త్ అలవెన్సు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పట్టణ జనాభా ప్రాతిపదికన కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు. మరణించిన కార్మిక కుటుంబాలకు ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశారు. మేస్త్రీ మాధవపై వేధింపులు ఆపాలని కోరారు. పాత పని విధానం కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ హెచ్.శంకరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కోశాధికారి టి.ఇందు, నాయకులు టి.రవి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆనంద్

రైతులకు బ్యాంకులు సహకరించాలి : జెసి

ప్రజాశక్తి- పార్వతీపురంటౌన్

రైతు పండించే పంటలు, పెట్టుబడులకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు రుణాలు త్వరితగతిన అందించేందుకు బ్యాంకు అధికారులు సహకరించాలని జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి సాంకేతిక కమిటీ (డిఎల్‌టిసి) రానున్న 2023-24 ఆర్థిక సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్ వరి, ఇతర పంటల రుణ పరిమితి నిర్ధారణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరం వ్యవసాయ అనుబంధ రంగాల పంటల దిగుబడి, చిన్న తరహా పరిశ్రమల ఆదాయం అంచనా ఆధారంగా రుణ పరిమితి నిర్ధారణ చేయడమైందన్నారు. రైతుకు ఎంత మేరకు యూనిట్‌కు రుణాలు అందించవచ్చనే అంశాలపై ప్రత్యేకంగా చర్చించి రుణాల పరిమితిని నిర్ధారించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం లక్ష్యాలు పూర్తికి చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుకు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం సాధించేలా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో నాబార్డ్ డిడిఎం నాగార్జున, ఎల్‌డిఎం జెఎల్‌ఎన్ మూర్తి, జిల్లా సహకార అధికారి బి.సన్యాసి నాయుడు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు అర్.శ్రీనివాస్, ఉద్యానవన శాఖ ఉప సంచాలకులు కె.ఎస్.ఎన్.రెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఆరిక ఈశ్వరరావు, జిల్లా మత్స్య శాఖ అధికారి వేముల తిరుపతయ్య, డిసిసిబి సిఇఒ కె.జనార్ధన, డిజిఎం కెవివిఆర్ఎన్ సత్యనారాయణ, ఎజిఎంలు ఎ.శ్రీనివాసనాయుడు, ఎం.రామకృష్ణ, బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై ఐటిడిఎ పిఒ సమీక్ష

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలో జగనన్న లేఅవుట్‌ల్లో పేదల ఇళ్ల నిర్మాణంపై బుధవారం ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్ సమీక్ష నిర్వహించారు. కొద్దిరోజుల క్రితం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పట్టణ, మండల పరిధిలో గృహ నిర్మాణంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీలో గృహ నిర్మాణానికి సంబంధించి ప్రత్యేక అధికారిగా ఉన్న ఐటిడిఎ పిఒ కూడా పట్టణ గృహ నిర్మాణంపై సమీక్ష చేపట్టారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పట్టణానికి సంబంధించిన జగనన్న లేఅవుట్‌ల్లో గృహ నిర్మాణ పనులు ప్రారంభించేలా చూడాలని ఆదేశించారు. గుమడాం లేఅవుట్ -5లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కోరారు. లబ్దిదారులకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హెచ్.శంకరరావు, హౌసింగ్ డిఇ సోమేశ్వరరావు, ఎఇ సూరినాయుడు పాల్గొన్నారు.

గృహనిర్మాణాలను సమీక్షిస్తున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక

సీతంపేట : స్థానిక ఎన్టీఆర్ గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో శిక్షణ పొందిన విద్యార్థులు కె.రోహిత్ కుమార్, వి.గణేష్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ ఎంపికయ్యారు. శ్రీకాకుళం జిల్లాలో ఈనెల 24న సిఎం కప్ పోటీలకు గ్రీన్ ఫీల్డ్ స్టేడియం నుంచి ఎనిమిది మంది విద్యార్థులు వెళ్లగా వీరిలో బాస్కెట్‌బాల్‌లో ద్వితీయ జిల్లా స్థాయి ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. ఈ ఇద్దరు విద్యార్థులు మాత్రం రాష్ట్రస్థాయికు బాస్కెట్ బాల్ రాష్ట్రస్థాయికి ఎంపికవ్వడంతో ఐటిడిఎ పిఒ బి.నవ్య, డిడి బి.నగేష్, ప్రిన్సిపల్ ఎల్.తిరుపతిరాజు, ఎల్.విశ్వనాథం, ఐటిడిఎ స్పోర్ట్స్ ఇన్‌చార్జి ఎస్.జాకబ్ దయానంద్, కోచ్‌లు వంశీరెడ్డి, రాజేష్ అభినందించారు.

ఎమ్మెల్యేకు వినతిని అందజేస్తున్న రైతులు

ధాన్యం కొనుగోలుపై ఎమ్మెల్యేకు వినతి

జియ్యమ్మవలస : సంక్రాంతి తర్వాత ధాన్యం కొనుగోలు చేపట్టడం లేదని, కొనుగోలు జరిగేలా చేసి రైతులను ఆదుకోవాలని మండల రైతులు స్థానిక ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణికి విన్నవించారు. కల్లాల్లోనే ధాన్యం ఉండిపోయాయని, ప్రొక్యూర్మెంట్ నిలిపివేయడంతో ధాన్యం అమ్ముకోలేకపోతున్నామని రైతులు ఎమ్మెల్యే వద్ద మొరపెట్టుకున్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టేలా చూస్తామని పుష్ప శ్రీవాణి రైతులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో రాయిపల్లి మహేష్, మరడాన కిషోర్, వాన నారాయణరావు, ఆంద విశ్వనాథం తదితరులు ఉన్నారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు దోనుబాయి విద్యార్థి

సీతంపేట :మండలంలోని దోనుబాయి బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థి సింహాద్రి జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి వాలీబాల్ అండర్-17 పోటీలు కర్నూలులో ఈనెల 24, 25 తేదీల్లో జరిగాయి. ఈ పోటీలకు శ్రీకాకుళం జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ టీమ్ తరపున దోనుబాయి విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో సింహాద్రి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. దీంతో ఐటిడిఎ పిఒ బి.నవ్య, డిడి బి.నగేష్, ఎసిఎమ్ ఎం.యుగంధర్, ఐటిడిఎ స్పోర్ట్స్ ఇంచార్జ్ ఎస్.జాకబ్ దయానంద్, ప్రధానోపాధ్యాయులు కొండగురు సుబ్బారావు, డిప్యూటీ వార్డెన్ వి.ఉత్తరరావును అభినందించారు.

సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పార్వతీపురంరూరల్ : అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, పింఛన్ల తొలగింపుపై లబ్ధిదారులు ఆందోళన చెందనక్కర్లేదని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని పుట్టూరు పంచాయతీ పరిధిలో బుధవారం జరిగిన గడపగడపకు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయో, లేదో ఆరా తీశారు. లబ్ధిదారులకు సంబంధించిన వివరాలు ఉన్న కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి ఏగిరెడ్డి సతీష్‌కుమార్, ఎంపిటిసి సభ్యులు వై.లక్ష్మి, ఎంపిపి శోభారాణి, జెడ్‌పిటిసి సభ్యులు రేవతమ్మ, ఎఎంసి చైర్మన్ భాగ్యలక్ష్మి, నాయకులు రమేష్, నాగేశ్వరరావు, శేఖర్, వై.రమణమూర్తి, కల్యాణ్ పాల్గొన్నారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్

ఇసుక ర్యాంపు పరిశీలన

వీరఘట్టం: మండలం పరిధిలోని వనస నందివాడ ఇసుక ర్యాంపును బుధవారం పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ పరిశీలించారు. ఎటువంటి ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయోనని గుర్తించారు.అంతకుముందు వీరఘట్టం మండల కేంద్రంలోని రేషన్ డిపో పరిధిలో ఉన్న లబ్ధిదారులను సక్రమంగా డీలర్లు బియ్యం పంపిణీ చేస్తున్నారు లేదో అని తెలుసుకున్నారు. ఆయనతో పాటు ఇన్చార్జి తహశీల్దార్ చందక సత్యనారాయణ, సి ఎస్ డి టి మల్లేష్, వీఆర్వోల అప్పలనాయుడు సురేష్ ఉన్నారు.

బిసి కాలనీలో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం : మండల కేంద్రమైన వీరఘట్టం బిసి కాలనీలో బుధవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారులు ఎస్ఎస్ వర్మ, ఎస్.తనూజ వృద్ధులకు, చంటి పిల్లల, గర్భిణుల, బాలింతల , మధుమేహ, రక్తపోటు తదితర వ్యాధిగ్రస్తులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ విజిటర్ ఒ.శాంతకుమారి, ఎఎన్ఎం ఉష, టెక్నీషియన్ దినేష్, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

పాలకొండ రూరల్ : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక సిరి స్కూల్‌లో ప్రిన్సిపల్ పడాల రవి ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు బుధవారం నిర్వహించారు. ఈ ఆటల పోటీల్లో భాగంగా కబడ్డీ జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ మూడు విభాగాల్లో పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరిక ఉల్లాసానికి తోడ్పడతాయని విద్యార్థిని, విద్యార్థులంతా విధిగా క్రీడల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. అలాగే గెలుపొందిన విద్యార్థులకు గణతంత్ర దినోత్సవం రోజున బహుమతుల ప్రదానం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పి.కొండలరావు, డి.రామలింగం(రాము), కెవిఆర్, ఆర్.గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

స్వచ్ఛమైన ఓటరు జాబితా తయారీకి సహకరించాలి

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

స్వచ్ఛమైన ఓటరు జాబితా తయారీకి ప్రతి ఒక్కరూ సహకరించాలని సీతంపేట ఐటిడిఎ పిఒ బి.నవ్య అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల ఎన్ఎస్ఎస్ సేవా శిబిరంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటర్ల నమోదుపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు కావాలన్నారు. బాధ్యతగా ప్రతిఒక్కరూ తమ ఓటును చేర్పించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.సోమేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపల్ జనార్ధన్‌నాయుడు తదితరులున్నారు.

ఉద్యోగులు ప్రతిజ్ఞ

సీతంపేట : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక ఐటిడిఎలో పిఒ బి.నవ్య ఆధ్వర్యంలో ఉద్యోగులంతా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పిఒ మాట్లాడుతూ ఓటర్లంతా తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి, ఎఒ విజయరాణి, డిపిఒ వై.సతీష కుమార్, జూనియర్ అసిస్టెంట్ త్రినాధరావు, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో....

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా గుర్తింపు పొందాలని ఐటిడిఎ పిఒ బి.నవ్య అన్నారు. జాతీయ వాటర్ దినోత్సవం సందర్భంగా స్థానిక తహశీల్దార్ నరసింహామూర్తి ఆధ్వర్యంలో రెవెన్యూ శాఖ ఉపాధి హామీ సిబ్బంది స్థానిక రెవెన్యూ కార్యాలయం నుంచి సంత మార్కెట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అలాగే బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.గీతాంజలి, ప్రిన్సిపల్ జీవనజ్యోతి, రెవెన్యూ పరిశీలకులు వెంకటేష్, ఎపిఒ సాగర్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం :మండల కేంద్రంలోని బుధవారం జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుంచి ప్రధాన రహదారి మీదుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించిన విద్యార్థులు ప్లకార్డులు చేత పట్టుకుని 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ చందక సత్యనారాయణ, ఎంపిడిఒ ఎ.ప్రభాకరరావు, ఎపిఒ జి.సత్యంనాయుడుతో పాటు విఆర్ఒలు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కురుపాం : ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కలిగి ఉండాలని పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమల్ అన్నారు. స్థానిక తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవ ర్యాలీలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. ఓటు విలువ ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయం వద్ద సీనియర్ ఓటర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఉపతహశీల్దార్ నాగేశ్వరరావు, ఎంఇఒ ఎన్.సత్యనారాయణ, ఆర్ఐ ప్రసాద్, ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కురుపాం : ర్యాలీలో పాల్గొన్న పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్ కమల్

సీతంపేట : సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐటిడిఎ పిఒ నవ్య

గుమ్మలక్ష్మీపురం : 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గుమ్మలక్ష్మీపురం లో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కు ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఓటు హక్కు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తహసీల్దార్ జె.రాములమ్మ అన్నారు. ఓటు హక్కు ప్రాధాన్యత వివరిస్తూ పలు రకాల ముగ్గులు వేశారు. కార్యక్రమం లో రజక కార్పొరేషన్ డైరెక్టర్ జి. గిరిబాబు పలువురు అధికారులు పాల్గొన్నారు.

భామిని: మండలంలోని కొసలి పంచాయతీ పరిధిలో కార్యదర్శి ఎం.మహేంద్ర ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవంలో భాగంగా సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు ర్యాలీ నిర్వహించి, ఓటు హక్కు ప్రాధాన్యత అంశాలపై అవగాహన కలిగించి, ప్రతిజ్ఞ నిర్వహించారు. 18 ఏళు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని, ఓటు అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు, మీ ఓటు హక్కు మీ భవిష్యత్తును నిర్ణయించే హక్కు ఇస్తుంది అని, యువత పెద్ద ఎత్తున ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కొసలి సర్పంచ్ వలురౌతు రామకృష్ణ ఉన్నారు.

బిత్రపాడులో ఏనుగుల సంచారం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని బిత్రపాడులో గజరాజులు తిష్టవేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెలరోజుల పాటు కష్టపడి పండించిన మొక్క జొన్నకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏపుగా మొక్కజొన్న పెరిగిందన్న సంతోషంలో ఉన్న సమయంలో ఏనుగులు వచ్చి తిష్ట వేసి పంటను నాశనం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ గ్రామంలోనే కాకతీయవలస, కొమరాడ మండలాల్లో ఏనుగులు సంచరించి మొక్కజొన్న పంటను ధ్వంసం చేస్తున్నాయి. వందలాది ఎకరాల్లో మొక్కజొన్న పంటను ఇలా ఏనుగులు ధ్వంసం చేయడంతో రైతులు కన్నీరుమున్నీరై రోధిస్తున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి మొక్కజొన్న సాగు చేస్తుంటే ఏనుగులు వచ్చి నాశనం చేస్తున్నాయని, దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల సమస్య పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

బిత్రపాడు పొలాల్లో సంచరిస్తున్న ఏనుగులు

రాత్రివేళల్లో అటవీశాఖ పహారా

భామిని : ఏనుగుల దాడిలో ఈనెల 16న మండలంలోని తాలడలో రైతు గోపిశెట్టి చిన్నారావు మృతి చెందడంతో పాటు, ఏనుగులు కాపుకు వస్తున్న పంటలను ఏనుగులు ధ్వంసం చేస్తున్న నేపథ్యంలో వీటి సంచారాన్ని అరికట్టేందుకు అటవీశాఖాధికారులు రాత్రివేళల్లో పహారా కాస్తున్నారు. మండలంలోని ఘనసర, తాలాడ, కీసర, కొసలి గ్రామాల నుంచి ఏనుగులను నల్లరాయి గూడ, రేగిడి ఎగువప్రాంతాలకు తరలించి, తిరిగి గ్రామాల వైపు రాకుండా 28 మంది అటవీశాఖ సిబ్బంది బేస్ క్యాంపు ద్వారా రాత్రీ, పగలు అగ్గి మంటలు వేసి పహారా కాస్తున్నారు. ఈ బేస్ క్యాంపును, రాత్రులు ఏనుగులు సంచరిస్తున్న ప్రాంతాలను అటవీశాఖ రేంజ్ అధికారి కె.తవిటినాయుడు మంగళవారం రాత్రి 12 గంటల ప్రాంతంలో పరిశీలించారు. దిగువ గ్రామాల్లో ఏపుగా పెరిగిన మొక్క జొన్న, చెరకు ఉండడం, వంశధార నదీ పరివాహక ప్రాంతంకావడంతో తిరిగి గ్రామాలకు వెళ్లడానికి ఏనుగులు తీవ్ర ప్రయత్నిస్తున్నాయి. వీటిని నిలువరించేందుకు అగ్గి మంటలు, టపాసులు పేల్చడం ద్వారా సిబ్బంది నిలువరిస్తున్నారని ఎఫ్ఆర్ఒ తెలిపారు. ఈ కార్యక్రమం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ హరికష్ణ, సిబ్బంది ఉన్నారు.

ఉపాధిహామీని నిర్వీర్యం చేసే యోచనను మానుకోవాలి

ప్రజాశక్తి - పాచిపెంట

ఉపాధిహామీ చట్టాన్ని కేంద్రప్రభుత్వం నిర్వీర్యం చేసే యోచనను మానుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు సుద్రు రామారావు అన్నారు. మండలంలోని మాతుమూరులో వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం గొర్లె రామారావు అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సుద్రు రామారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే ఆలోచన చేసుకోవడం మానుకోవాలన్నారు. ఈ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని, కేరళ తరహాలో రూ.600 రోజుకూలి చెల్లించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పోరాడి సాధించుకున్న ఉపాధిహామీ చట్టాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మన రాష్ట్రంలో ఉపాధి వేతనం రూ.150 నుంచి రూ.200లోపే కూలి పడుతోందని, దీనివల్ల కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన చట్టాన్ని సక్రమంగా అమలు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం.పైడితల్లి, రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు షేక్ ఫరీద్, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

నేడు పెన్షనర్లకు నేత్ర పరీక్షలు

పార్వతీపురంటౌన్ :స్థానిక పెన్షనర్ల భవనంలో రిపబ్లిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జాతీయ పతాకావిష్కరణ, నెలవారీ సమావేశం, ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు గంట జగన్నాథం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగులంతా హాజరుకావాలని, నేత్ర పరీక్షల కోసం తమ ఇహెచ్ఎస్, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కార్డులను తీసుకురావాలని కోరారు.

గ్రామాల్లో ఇదేం కర్మ మన రాష్ట్రానికి...

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని దశమంతపురం, చలివేంద్రిలో బుధవారం టిడిపి పాలకొండ నియోజకవర్గ బాధ్యులు నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, ఎఎంసి మాజీ చైర్మన్ పి.కృష్ణమూర్తినాయుడు, మండల అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్, మండల ప్రధాన కార్యదర్శి చింత ఉమామహేశ్వరరావు, టిఎన్‌టియుసి ఎన్.శశికుమార్, నియోజకవర్గ యువత అధ్యక్షులు పారిచర్ల వెంకటరమణ, మండల తెలుగు యువత నాయకులు మాచర్ల అనిల్, ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు బి.అప్పన్నదొర, లింగల చంటి, బొత్స సత్యనారాయణ, ఎ.కుమారస్వామి, జక్కు రామకృష్ణ, సాకెట్ సింహాచలం, కోడూరు వెంకటరమణ, నెల్లి ఆనందరావు, కందుల అనంతరావు , కర్రి జగదీష్, పాలవలస సత్యం నాయుడు, పాలూరి నారాయణరావు, కార్యకర్తల, అభిమానులు, పాల్గొన్నారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ కృష్ణమహేష్‌రెడ్డి

ఉపాధి పనులు సక్రమంగా చేపట్టాలి

ప్రజాశక్తి -పాలకొండ రూరల్

ఉపాధి పనులు సక్రమంగా చేపట్టాలని ఎంపిడిఒ డొంక త్రినాధులు అన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనివేళల్లో సక్రమంగా పనిచేసేలా చూడాలన్నారు. సిబ్బంది యాప్‌లలో వివరాలు సక్రమంగా నమోదు చేయాలన్నారు. కూలీలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. ఆయనతో పాటు ఎపిఒ ఈశ్వరమ్మ ఉన్నారు.

ఐటిఐలో అప్రెంటీస్ మేళా

సీతంపేట : స్థానిక ప్రభుత్వ ఐటిఐలో మేధా సర్వో హైదరాబాద్ సంస్థ ద్వారా అప్రెంటిస్ మేళా నిర్వహించినట్లు ఐటిఐ ప్రిన్సిపల్ టివి గిరి తెలిపారు. ఎంఎంవి, వెల్డర్ ట్రేడ్ ట్రైనీలను గతంలో వరుణ్ మోటార్స్ తో కుదుర్చుకున్న ఎంఒయు సందర్భంగా డిఎస్‌టి ట్రైనింగ్‌పై యువతకు అవగాహన కల్పించి ఒప్పంద పత్రాలపై అంగీకారం తీసుకున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. అలాగే జాతీయ ఓటర్ల దినోత్సవం గురించి అవగాహన కల్పించారు.

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం

ప్రజాశక్తి - సీతానగరం

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపిడిఒ బి.కృష్ణ మహేశ్ రెడ్డి అన్నారు. మండలంలోని ఆర్.వెంకంపేట, రామవరం గ్రామాల్లో లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించి ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా చేయాలన్నారు. ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందన్నారు. అనంతరం ఆర్.వెంకంపేట సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయ సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. పాఠశాల విద్యార్థుల రికార్డులను పరిశీలించారు. ఆయనతో పాటు ఇఒపిఆర్‌డి కెకె వర్మ, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్ నుంచి అవార్డును అందుకుంటున్న మహిళా పోలీసు రోజా

ఉత్తమ బిఎల్‌ఒగా మహిళా పోలీస్

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం సచివాలయంలో మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తున్న ఎం.రోజా ఉత్తమ మహిళా పోలీస్‌గా విధులను నిర్వహిస్తూ, మరోవైపు ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారిని చైతన్యపర్చడంతో రోజా కీలకపాత్ర పోషించారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కురుపాం నియోజకవర్గంలోని ఐదు మండలాలు ఉండగా, కురుపాం సచివాలయంలో విధులు నిర్వహిస్తూ ప్రజా సమస్యలు, మహిళా సమస్యలు తెలుసుకొని అధికారులు దృష్టికి తీసుకెళ్లడంలో రోజా ముఖ్య పాత్ర పోషించారు. మరోవైపు ఓటు హక్కు పై అవగాహన కల్పించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించారు. దీంతో నియోజకవర్గస్థాయిలో ఉత్తమ ఉద్యోగిగా గుర్తింపు పొందింది. రోజాకు ఉత్తమ అవార్డు రావడం పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

రేగులపాడులో ధాన్యం చోరీ

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని రేగులపాడుకు చెందిన గేదెల చిన్నంనాయుడు, వారాడ రామకృష్ణకు చెందిన 20 ధాన్యం బస్తాలు మంగళవారం అర్ధరాత్రి చోరీకి గురయ్యాయి. కళ్లాంలో ఉన్న ధాన్యం చూసేందుకు వెళ్లిన రైతుల వేసిన బస్తాలు లేకపోవడంతో చోరీకి గురైనట్టు గుర్తించి బుధవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదుచేశారు.

350 లీటర్ల నాటుసారా పట్టివేత

పాలకొండ : స్థానిక రెల్లివీధి శివారులో ఒక పాఠశాల వద్ద ఎస్ఇబి సిఐ ఎం.జి.గోపాలకృష్ణ తన సిబ్బందితో దాడులు చేపట్టగా 350 లీటర్ల నాటుసారాను పట్టుకున్నారు. నలుగురు వ్యక్తులను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జిల్లా ఎస్‌పికి సమాచారం రావడంతో ఎస్‌పి వెంటనే స్థానిక ఎస్ఇబి అధికారులకు ఆదేశించడంతో వారు పక్కాగా రెక్కి నిర్వహించి దాడులు చేపట్టారు. అందులో నారాయణగూడకు చెందిన సవర బీమయ్య, రెల్లివీధికి చెందిన ఆకుల కుమార్, నారాయణ గూడకు చెందిన సవర ధర్మ, మండకు చెందిన సవర బసవయ్యను పట్టుకుని అరెస్టు చేశారు.

బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు

తలవరం పాఠశాల విద్యార్థులకు బంగారు పతకాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తలవరం జిల్లా ఉన్నత పాఠశాలలో చదువుతున్న రౌతు హారిక, అత్తిలి కృష్ణ రాష్ట్రస్థాయిలో బంగారు పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉప్పాడ అప్పారావు బుధవారం తెలిపారు. అన్నమయ్య జిల్లా మదనపల్లిలో బాల్ బ్యాడ్మింటన్ అండర్ 17 విభాగంలో రౌతు హారిక రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం నిలిచింది. వాలీబాల్ లో అండర్- 17 విభాగంలో అత్తిలి కృష్ణ రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం లభించినట్లు తెలిపారు. విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం లభించడంతో సిఎం చైర్మన్ అల్లు శ్రీనివాసరావు, సర్పంచి ఎస్ మధుసూదనరావు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పిడి రామకృష్ణకు, విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ఫేషియల్ యాప్‌ను రద్దు చేయాలని ధర్నా

ప్రజాశక్తి- నెల్లిమర్ల

అంగన్‌వాడీలకు ఫేసియల్ యాప్‌ను రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి సురేష్ అన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా చేపట్టారు. అలాగే గజపతినగరంలో సిఐటియు జిల్లా ఉపాధ్యాక్షులు వి. లక్ష్మి ఆధ్వర్యాన అంగన్‌వాడీ కార్యర్తలు చేసిన ధర్నా చేశారు. బొబ్బిలిలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు ఆధ్వర్యాన అర్బన్ ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వస్తే అంగన్వాడీలను రెగ్యులర్ చేస్తామని, కనీస వేతనాలు అమలు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, వేతనంలో సగం పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కాలువ పనులకు శంకుస్థాపన

భామిని : మండలంలోని బురుజోల పంచాయతీ పరిధిలో గల సింగిడిలో ప్రధాన రహదారికి ఇరువైపులా రూ.7లక్షలు ఎంపిపి నిధులతో చేపట్టే మురుగు కాలువ నిర్మాణానికి ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం బుధవారం శంకుస్థాపన చేశారు. పంచాయతీల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్‌ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, బత్తిలి ఎంపిటిసి టింగ అన్నాజీరావు, బురుజోల సర్పంచ్ మడపాన కేశవ, వైసిపి నాయకులు నిమ్మల త్రినాథ్, జగదీశ్ ఉన్నారు.

కాలువ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి ప్రతినిధి సింహాచలం